నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 15 మార్చి 2025 | NIZAMABAD


డిచ్‌పల్లిలో మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- సర్కారు తీరును నిరసిస్తూ భగ్గుమన్న గులాబీ శ్రేణులు
- ఉమ్మడి జిల్లాలో మిన్నంటిన నిరసనలు
- హామీల అమలుపై వెంటాడుతున్న బీఆర్ఎస్
- ప్రజా సమస్యలపై నిలదీస్తున్న నేతలపై కాంగ్రెస్ కుట్ర
- అందులో భాగమే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు
- చేతగాని రేవంత్ సర్కారుపై మండిపడిన నాయకులు

**జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ అక్రమం**

# ప్రశ్నిస్తే గెంటేస్తారా?


నందిపేట్‌లో దిష్టిబొమ్మ దహన కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు


ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై తెలంగాణ తల్లి విగ్రహ ప్రాంగణం వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

**హామీల అమలుపై** అడుగడుగునా నిలదీతలు.. ప్రజా సమస్యలపై పదే పదే ప్రశ్నాస్త్రాలు.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతున్న బీఆర్ఎస్ శ్రేణులు.. పాలనలో ఘోర వైఫల్యం చెందిన రేవంత్ సర్కారు గులాబీ పార్టీపై కక్ష గట్టింది. ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేసే చేతకాని ప్రభుత్వం ప్రశ్నించే గొంతును నొక్కుతున్నది. అక్రమ కేసులు పెట్టి లోపలేయడమే.. అసెంబ్లీలో నిలదీస్తున్న ఎమ్మెల్యేలను సభ నుంచి గెంటేస్తున్నది. అందులో భాగంగానే మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యే వరకు అసెంబ్లీ నుంచి అక్రమంగా సస్పెన్షన్ వేటు వేసింది. సర్కారు తీరును నిరసిస్తూ గులాబీ శ్రేణులు శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. రేవంత్ ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేశాయి. అక్రమ సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని, లేకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించాయి.

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మార్చి 14: మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై బడ్జెట్ సమావేశాల సెషన్ నుంచి సస్పెన్షన్ వేటు వేయడంపై ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం రోడ్లపైకి వచ్చి నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంతోపాటు ఎల్లారెడ్డి, కమ్మర్‌పల్లి, వేల్పూర్, ఆర్మూర్, నందిపేట్, డిచ్‌పల్లి తదితర మండల కేంద్రాల్లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కా ర్యర్తలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నందిపేటలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పా ల్గొని మాట్లాడారు. జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని, ఇది సీఎం రేవంత్‌రెడ్డి దురంహకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. త్వరలోనే సీఎం తగిన మూల్యం చెల్లించుకోకపోతప్పదని హెచ్చరించారు. కామారెడ్డిపట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేయగా.. పార్టీ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసే వరకూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజాపాలన పేరిట ప్రభుత్వం నయవంచనకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. జగదీశ్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు.

### రేవంత్‌రెడ్డిది కక్షపూరిత పాలన

ఎల్లారెడ్డి పట్టణంలోని తెలంగాణ తల్లి ప్రాంగణం వద్ద ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డిది కక్షపూరితమైన పరిపాలన కొనసాగుతుందని విమర్శించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కుట్రపన్ని ఏకపక్షంతో సస్పెండ్ చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ మాట్లాడుతూ...తెలంగాణ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌పై సీఎం స్థాయిలో ఉన్న రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి బహిష్కరించడం విడ్డూరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కన బెట్టి, ప్రశ్నిస్తున్న గొంతుకలను సస్పెండ్ చేస్తున్నదని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు అమలుచేయకుండా, ప్రజా సమస్యలను పరిష్కరించుకుండా పక్కదారి పట్టించడానికి ఇదంతా కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా అని విమర్శించారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై విధించిన అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.


కామారెడ్డి జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### వివరాలు అడిగితే సస్పెండ్ చేస్తారా?

డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్ ఎక్స్ రోడ్డు వద్ద మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అక్రమాలను ప్రశ్నించేందుకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం దారుణమన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో అలవి కాని వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదని విమర్శించారు. ఏడాది కాలంగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు అడిగితే మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే ఆయనను శాసనసభలోకి అనుమతించాలని డిమాండ్ చేశారు.

---

### నగరంలో దారుణం


# కన్నతల్లిని హతమార్చిన కూతురు

- వ్యక్తిగత విషయాల్లో అడ్డువస్తున్నదని భర్తతో కలిసి ఘాతుకం
- నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చిన పోలీసులు

వినాయక్‌నగర్, మార్చి 14: తన వ్యక్తిగత విషయాల్లో అడ్డువస్తున్నదని కన్నతల్లినే భర్తతో కలిసి ఓ కూతురు హతమార్చింది. మూర్ఛవ్యాధితో మృతి చెందినట్లు నమ్మించడానికి చేసిన ప్రయత్నం బెడిసి కొట్టడంతో కటకటాల పాలయ్యింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్నది. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం,300 క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న విజయలక్ష్మి(58) ఓ హోటల్‌లో పనిచేస్తున్నది. నాలుగేండ్లుగా ఆమె ఇంట్లోనే కూతురు సౌందర్య, అల్లుడు రమేశ్ ఉంటున్నారు. తనతోపాటు తన భర్తకు సంబంధించిన వ్యక్తిగత విషయాల్లో తన తల్లి జోక్యం చేసుకుంటూ తలనొప్పిగా మారిందని కూతురు కక్ష పెంచుకున్నది. ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీన రాత్రి విజయలక్ష్మి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కూతురు, అల్లుడు కలిసి ఆమె ముఖంపై తలదిండుపెట్టి, గొంతునొక్కి హత్య చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. తమ దర్యాప్తులో సౌందర్య, రమేశ్ నిందితులుగా తేలగా వారిపై ఎస్సై గంగాధర్ కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. శుక్రవారం వారిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన నార్త్ రూరల్ సీఐ బి.శ్రీనివాస్, ఐదో టౌన్ ఎస్సై గంగాధర్, సిబ్బందిని ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి అభినందించారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్

---


నిజామాబాద్ జిల్లా కేంద్రంలో హోలీ సంబురాల్లో పాల్గొన్న ఓ ప్రైవేట్ కళాశాల విద్యార్థినులు



# రంగుల పండుగ

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. గురువారం కామదహన కార్యక్రమాలు నిర్వహించగా.. శుక్రవారం రంగుల పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. చిన్నా, పెద్దా తేడాలేకుండా రంగులు చల్లుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలుచోట్ల ప్రకృతి సహజసిద్ధమైన రంగులను చల్లుకోవడం కనిపించింది.


ఎల్లారెడ్డిలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు


కామారెడ్డిలో చిన్నారుల కేరింతలు

---


**మాజీ మంత్రి,** బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం తన పుట్టిన రోజు సందర్భంగా ఎర్రవల్లిలోని ఫాం హౌస్‌లో బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ వేములకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి, ఆశీస్సులు అందజేశారు.
– మోర్తాడ్, మార్చి 14

---

### గూగుల్ మ్యాప్‌తో వెళ్లి..
# ప్రమాదం బారిన పడి..


కాలువలోకి దూసుకెళ్లిన కారు

- మరో మార్గంలో వెళ్లిన కుటుంబం
- డ్రైవర్ నిద్రమత్తుతో కాలువలోకి దూసుకెళ్లిన కారు
- భిక్కనూరు మండలంలో ఘటన

భిక్కనూరు, మార్చి 14: గూగుల్ మ్యాప్ మరో మార్గం చూపించడంతో ఓ కుటుంబం ప్రమాదం బారిన పడింది. నిద్రమత్తులో డ్రైవింగ్ చేస్తుండడంతో కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన భిక్కనూరు మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌కు చెందిన ఓ కుటుంబం శుక్రవారం వేకువజామున ఆదిలాబాద్ జిల్లా బాసర సరస్వతీ ఆలయానికి కారులో బయల్దేరింది. సదరు కుటుంబీకులు గూగుల్ మ్యాప్ ద్వారా బాసరకు వస్తుండగా భిక్కనూరు మండలం 44వ జాతీయ రహదారిని చూపించకుండా తహసీల్ ఆఫీస్ నుంచి లోకేషన్ చూపించింది. దీంతో వారు భిక్కనూరు నుంచి అంతంపల్లి గ్రామం వరకు నూతన బీటీ రోడ్డు వేయగా ఆ మార్గం గుండా వెళ్లసాగారు. కారు నడుపుతున్న కుటుంబ యజమాని నిద్రమత్తులో ఉండడంతో కారు రోడ్డు పక్కనున్న కాలువలోకి దూసుకెళ్లి, బురదలో చిక్కుకొని అక్కడే ఆగిపోయింది. పెను ప్రమాదం తప్పడంతో కారులో ప్రయాణిస్తున్నవారు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని కాలువలోకి దూసుకెళ్లిన కారును జేసీబీ సాయంతో బయటికి తీయించారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. అనంతరం వారు బాసరకు బయల్దేరారు.

---


హున్సా గ్రామంలో పిడిగుద్దులాటలో తలపడుతున్న గ్రామస్తులు

# ప్రశాంతంగా పిడిగుద్దులాట

బోధన్ రూరల్, మార్చి 14: పోలీసులు ఆంక్షలు విధించినా హున్సా గ్రామస్తులు తమ ఆచారాన్ని కాపాడుకున్నారు. వందేండ్లకు పైగా జరుపుకుంటున్న పిడిగుద్దులాటను కొనసాగించారు. హోలీ సందర్భంగా సాలూరా మండలం హు న్సా గ్రామంలో శుక్రవారం సాయంత్రం పిడిగుద్దులాటను ఉత్కంఠభరిత వాతావరణంలో నిర్వహించారు. ఏడు నిమిషాలపాటు కొనసాగిన ఈ ఆటపై పోలీసులు ఆంక్షలు విధించినా గ్రామస్తులు పట్టించుకోలేదు. సాయంత్రం 6గంటలకు ప్రారంభమైన ఆట ఏడు నిమిషాల్లో ముగిసింది. గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయి హనుమాన్ మందిరం వద్దకు చేరుకున్నారు. అక్కడ అడ్డంగా కట్టిన తాడుకు రెండు వైపులా నిలబడి మోకాలు, వీపులపై గుద్దుకున్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ ఆట ను ఆడవద్దంటూ పోలీసులు ఆంక్షలు విధించినప్పటికీ గ్రామస్తులు మాత్రం ఈ సాంప్రదాయాన్ని యథావిధిగా కొనసాగించడం గమనార్హం. పిడిగుద్దులాట నిర్వహించకుంటే గ్రామానికి అరిష్టం జరుగుతుందని గ్రామస్తుల విశ్వాసం.

### ఏడు నిమిషాలు ఉత్కంఠభరితంగా ..

పిడిగుద్దులాట ప్రారంభం కాక ముందు గ్రామ శివారులో కుస్తీ పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని హనుమాన్ మందిరం పొడవునా ఓ తాడును కట్టారు. ఆట ముందు డప్పు వాయిద్యాలతో గ్రామపెద్దలను వారి ఇండ్లకు చేరుకొని ఆట జరిగే ప్రదేశానికి తీసుకువచ్చారు. రెండు వర్గాలుగా విడిపోయి కేరింతల మధ్య కొన్ని నిమిషాల పాటు పిడిగుద్దులాట ఆడారు.